# వధువు కావలెను

పదవీ విరమణ చేసిన మగాడు ధాన్యం తీసేసిన గడ్డిలాంటి వాడనీ, ఆ గడ్డి పశువులకైనా ఉపయోగపడుతుందిగాని రిటైరయిన మగాడు అందుకు కూడా పనికిరాడని, ఒక కథలో రచయిత చెప్పినట్టు గుర్తు. నేను పదవీ విరమణ చేసి సుమారు సంవత్సరం అవుతోంది. ఉద్యోగంలో ఉండగా ఎప్పుడూ బిజీగా ఉండడం, ఇంట్లో అవసరాలకు కూడా అందుబాటులో లేకపోవడం జరుగుతూండేది. చాలా సందర్భాలలో. అలాంటిది ఎప్పుడూ ఇంట్లోనే ఉండి పోవడం నా శ్రీమతికి చాలా విసుగ్గా ఉంది.

'పోనీ ఏదైనా ఉద్యోగంలో చేరకూడదూ, ఓపిక ఉంది కదా, అలా గోళ్లు గిల్లుకుంటూ, నా వంటలో వంకలు పెడుతూ, రిటైరయిపోయినా సమయానికి తిండి అమరకపోతే చిరాకులు, పరాకులు' అంటూ ఆమె చెవిలో ఇల్లు కట్టుకుని పోరుతున్నా నేను ఆ ప్రయత్నం చేయలేదు. కారణం ఏమిటంటే ఉద్యోగంలో ఉండగా అందరూ నా దగ్గరకు వచ్చి చేయి చాపేవారు. అలాంటిది నేను ఇప్పుడు మరలా ఉద్యోగంలో చేరితే వసుదేవుడు దేన్నో ఏదో చేసినట్లుగా ఉంటుందని బాధ.

ఒక వారం రోజుల్నుంచి తీవ్రంగా ఆలోచించి, కంప్యూటర్ బ్రెయిన్‌ని బ్రౌజ్‌చేసి ఒక్క చోట క్లిక్ చేశాను. అంతే క్లియర్ పిక్చర్ వచ్చేసింది. ఎలాగూ నా దగ్గర సిస్టమ్ ఉంది. ఇంటర్‌నెట్ కూడా ఉంది. పెద్ద పెట్టుబడి అవసరం లేదు అనుకుని..

'ఏవోయ్ ఏం చేస్తున్నావ్...' అంటూ శ్రీమతిని కేకేశాను. కొంగుకు చేతులు తుడుచుకుంటూ వచ్చేసింది 'ఏం పెన్షనర్లకి కరువుభత్యం పెంచేరా ఏమిటి?' అంటూ.. 'ఇంట్లోనే ఉండిపోయి బోర్ కొట్టించేస్తున్నానంటున్నావుగా, నాకు 'మైక్రోసాఫ్ట్' లాంటి అద్భుతమైన ఐడియా వచ్చింది. మనదేశంలో పెళ్ళి సంబంధాలకు అనేక వెబ్‌సైట్‌లు ఉన్నాయి. నీకు తెలుసుకదా...'

'అవుననుకోండి. మీరూ మరో సైట్ ఓపెన్ చేస్తారా ఏమిటి? చాల్లెండి సంబడం మన దగ్గరకి ఎవరు వస్తారు?" ఆదిలోనే హంసపాదులా ఇలా అంటుందేమిటి అనుకుంటూ 'అదేమరి నేను చేప్పేది పూర్తిగా వినకుండా అపశకునాలు పలకొద్దు. నేను పెట్టబోయే వెబ్‌సైట్ మనుషులకు కాదోయ్, శునకరాజాలకు, రాణీలకు మాత్రమే. నీకు తెలియదుగాని చాలామంది ధనవంతుల ఇళ్ళలో కుక్కలు అనుభవించే రాజయోగం చూస్తే ఆశ్చర్యపోతావ్' అంటున్న నన్ను అదోలా చూసి...

'చాల్లెండి సంబరం, కుక్కలకు పెళ్ళి సంబంధాలు చూస్తారా? నోరు మూసుకుని ఇంట్లో కూర్చోండి. మిమ్మల్ని అందరూ పిచ్చోళ్ళనగలరు' అంటూ రెండు చేతులూ నా వేపు పెట్టి, పాత సినిమాల్లో రమణారెడ్డి మీద విరుచుకుపడే సూర్యకాంతం లాగా ఫోజు పెట్టింది నా శ్రీమతి. అయినా నేను వదిలితేనా...

'ఒక్కమాట విను. మనకు పెట్టుబడి అవసరం లేదు. ఇంటర్నెట్ ఉంది. ఒక బల్ల కుర్చీ, కంప్యూటర్, టేబుల్, నాలుగు ఫైబర్ కుర్చీలు. ఇదే మన ఆఫీసు. మన హాలుని ఆఫీసు చేస్తాను. హాలులో మూడో భాగం ఇటుకలతో గోడ కట్టించి ఒక గదిలా తయారు చేస్తాను. అక్కడ పెళ్ళిచూపులు మనమే ఏర్పాటు చేస్తాం. ప్రస్తుతం పైసా పెట్టుబడి అక్కరలేదు. కేవలం రెండు శునకరాజులకు సంబంధం కుదిర్చామే అనుకో... ఇక మన పని చూసుకో...' అంటోన్న నా మాటలకు అడ్డువచ్చి 'సరే కానివ్వండి' అంది. ఎప్పుడో కోన్ ఐస్క్రీమ్ తినే పిల్లాడు కప్ ఐస్క్రీమ్ తింటానంటే తల్లి కొనిచ్చినంత సంబరం కలిగింది నాలో. వారం రోజుల్లో మొత్తం వార్తా పత్రికలలో ప్రకటనలు వచ్చేశాయి.

**'కుక్కలను పెంచుకునే వారికి శుభవార్త!**

డబ్ల్యు డబ్ల్యు డబ్ల్యు పప్పీ లవ్ డాట్ కామ్ అనే సంస్థ మీ ముద్దుల పప్పీల కోసం స్థాపించబడింది. మీరు మీ ఇంట్లోనే ఉండి, మీరు అల్లారు ముద్దుగా పెంచుకునే మీ డాగ్‌కు వయసొచ్చిందని తెలియగానే మమ్మల్ని సంప్రదించండి. మీ శునకరాజు లేదా శునకరాణికి చక్కని యోగ్యమైన సరిజోడి సంబంధం చూసి పెట్టగలం. అలాగే మా కార్యాలయంలోనే వాటికి పెళ్ళిచూపుల కార్యక్రమం కూడా ఏర్పాటు చేస్తున్నాం. ఈ సేవలన్నీ చాలా తక్కువ ధరలకే. శునకాలకు సంబంధాలేమిటి? అని మీరు నుదురు కొట్టుకుంటున్నారు కదూ. దిగువ పేర్కొన్న కొన్ని దృశ్యాలు తలచుకోండి.

మీరు మీ శునకరాణిని షికారుకు తీసుకువెళ్తున్నారనుకోండి. అది ఒక మగ కుక్క వేపు చూసి ఆశగా అడుగువేసి, తోక ఊపుకుంటూ మన చేతిలో గొలుసు తెంపుకుని వెళ్ళిపోయిందా? మీ శునకరాజు తిండి తినకుండా ముడుచుకుని పడుకుని ఉన్నాడా? దాని బాధ మేము తీరుస్తాం.

మా వద్ద జర్మన్ షెపర్డ్, లేబ్రా డాగ్, డాల్మేషన్, పగ్, బ్రిటీష్ బుల్‌డాగ్, పోమేరియన్, డ్యాష్ హూండ్, డాబర్‌మేన్ వంటి మేలు జాతి శునకాలకు సంబంధాలు సిద్ధంగా ఉన్నాయి. వెంటనే సంప్రదించండి.

రంగు రంగుల్లో మంచి జాతి కుక్కల ఫోటోలతో ప్రకటనలు ప్రకటించిన పత్రికల వాళ్ళంతా మాకు పేపర్లు పంపించారు. ప్రకటనలకు చాలా ఖర్చయింది. ఆ సంగతి నా శ్రీమతికి చెప్పలేదు ఎందుకంటే ఈ వయసులో ఫుడ్, బెడ్, దూరమైతే

బహుకష్టకాలం అని, కొత్త ప్రయోగం అని పేపర్ల వాళ్ళు ఉచితంగా ప్రకటనలు వేశారని డబ్బులు తీసుకుని కోర్టులో సాక్షి అబద్ధం చెప్పినంత ఈజీగా చెప్పేశాను.

ఒక పదిరోజులైంది పేపర్లలో ప్రకటనలు వచ్చి, ఆ రోజు ఫోను రింగైంది. అదే ఫస్ట్ ఫోన్ కాల్ కదా, నేను చాలా స్టైల్‌గా ఫోన్ ఎత్తి 'హలో పప్పీ లవ్ డాట్ కామ్ స్పీకింగ్' అన్నాను కాల్ సెంటర్స్ నుండి అమ్మాయి మాట్లాడినంత యాసతో...

'హలో నమస్తే అండీ మా డాబర్‌మేన్‌గారు పేచీలు పెట్టేస్తున్నాడు. వాడు లేత బ్రౌన్ కలర్‌లో అక్కడక్కడ గుండ్రని నల్లని చుక్కలతో మెరిసిపోతూంటాడు. కళ్ళు చాలా ఆకర్షణీయంగా ఉంటాయి. చాలా బాగుంటాడండి. డాగ్స్‌లో మా వాడు హీరో అనుకోండి. వాడికి పెర్మినెంట్‌గా కాదు అప్పుడప్పుడు ఆడుకోడానికి ఒక లేడీ డాబర్‌మేన్ కావాలి. అందజేయగలరా?" అన్నారు ఒక మహిళ ఫోనులో.

'మేడమ్ వెరీ మెనీ థ్యాంక్స్. మీరే డాబర్‌మేన్ కోసం చేసిన మొదటి కస్టమర్. మీరు అల్లారు ముద్దుగా పెంచుకునే పప్పీలకోసమే ఈ వెబ్‌సైట్ ఆవిర్భవించింది. మీ డాబర్‌మేన్ గారిని తీసుకురండి. నిన్ననే ఒక డాబర్‌మేన్ లేడీ రిజిస్టర్ అయింది. ఇక్కడికి ఇరవై కిలోమీటర్ల దూరంలో ఉన్న లేడీ డాబర్‌మేన్‌ని పిలిపిస్తాం. వాళ్ళిద్దర్నీ మా కార్యాలయంలో ఏర్పాటుచేసిన పెళ్ళిచూపుల గదిలో కలుపుదాం. ఆ డాబర్‌మేన్‌కి కూడా సరదాగా ఆడుకోడానికే సంబంధం కావాలన్నారు. బాగా కుదిరింది. లేడీ డాబర్‌మేన్ ఫోటో వస్తుంది. అయినా తినబోతూ రుచి ఎందుకులెండి. వచ్చేటప్పుడు డబ్బు పట్టుకురండి సుమారు పదివేలు ఖర్చవుతుంది' అన్నాను.

'థాంక్యూ వెరీ మచ్. యూ ఆర్ డూయింగ్ మార్వెలెస్ జాబ్ టు డాగ్ లవర్స్' అంటూ ఆమె ఫోను పెట్టేశారు. అంటే నాకు వెంటనే లేచి బ్రేక్‌డాన్స్ చేయాలనిపించింది మొదటి ఘన విజయానికి.

ఆ రోజు తొమ్మిదో తారీఖు, డాబర్‌మేన్ పెళ్ళిచూపులు. ఎవరెస్ట్ శిఖరం తొలిసారిగా అధిరోహించిన టెన్సింగ్ నార్కే అక్కడ భారతీయ జెండా పాతినప్పుడు ఎంత పొంగిపోయాడో నాకు తెలియదు గాని, నాకైతే లేచి నిలబడి 'హిప్ హిప్ హుర్రే' అని అరుస్తూ ఎగరాలనిపించింది సుమా! నా శ్రీమతికి మైండ్ రీడింగ్ తెలుసునో ఏమో నా బొంద ఆమె పరుగులతో నా దగ్గరకు వచ్చి ఏమయింది?' అంది 'అదేమిటి నేనేమీ అనలేదే...' అన్నాను. 'పిచ్చి మేళం కదా ఏదో అరిచేరు కదా. మాయగోల. కుక్కలకు సంబంధాలేమిటి అని చెబుతుంటే వినక పోతిరి. ఏమైనా అయిందంటే వెనక రబ్బరు తోక ఒకటి అంటించి వీధుల్లో వదిలేస్తాను. ఏమైపోతారో ఏమో....' అని నుదురుకొట్టుకుంటూ, తనలో తాను ఏదో మాట్లాడుకుంటూ లోపలకూ వెళ్ళిపోయింది. అమితమైన ఆనందంలో అరిచానో లేదో నాకైతే తెలియదు.

నేను పదవీ విరమణ చేసినప్పుడు ఆఫీసు వాళ్ళు ఇచ్చిన నలుపురంగు సఫారీ వేసుకుని ట్రిమ్‌గా తయారయ్యేను. ఇంతలో కుయ్ కుయ్ మంటున్న డాబర్‌మేన్ ఆడకుక్కను తీసుకుని ఒక ఇన్నోవా కారు వచ్చింది.

'నమస్తే సర్' అన్నారు ఆయన వస్తూనే. లేత బ్రౌన్ కలర్‌లో అక్కడక్కడ గుండ్రని నల్లని మచ్చలతో మెరిసిపోయే చర్మంతో చురుకైన చూపులతో తోక లేకుండా సుమారు రెండు అడుగుల ఎత్తులో ఉంది ఆ శునకరాణి.

'డాబర్‌మెన్ గారు వస్తాడు కొంచం సేపట్లో, మీరు దాన్ని తీసుకుని ఆ గదిలోకి వెళ్ళండి' అని తొలిసారిగా పెళ్ళిచూపుల గదిలోకి పంపించాను.

అనుకుంటూ ఉండగానే, స్కార్పియో కారులో డాబర్‌మేన్‌గారు వచ్చేశాడు. టగ్ ఆఫ్ వార్‌లో తాడు లాగి పట్టుకున్నట్టుగా ఆమె నానా అవస్థలు పడుతూ కుక్కను లోపలకు తీసుకు వచ్చింది. అది వగరుస్తూంది. మంచి బలంగా రెండున్నర అడుగుల ఎత్తులో మూడు అడుగుల పొడవులో అక్కడక్కడ నల్లని గుండ్రని మచ్చలతో బలేగా ఉంది. 'సర్ వీడికి జత వచ్చిందా?' అంటున్న ఆమెను లాగేస్తోంది అది పెళ్ళిచూపుల గది వేపు. దానికి వాసన వచ్చేసింది లావుంది అపుడే. ఆమె చాలా స్టైల్‌గా పంజాబి సూట్‌లో ఉంది.

'థాంక్యూ మేడమ్. మీ వాడికి సరియైన జోడి ఆ గదిలో ఉంది. అప్పుడే పసిగట్టేసింది మిమ్మల్ని అటేపు లాగేస్తుంది చూడండి' అన్నాను. ఆమె డాబర్‌మెన్‌తో ఆ గదిలో ప్రవేశించింది. నేనూ వెళ్ళాను ఆమె వెంట గొప్పగా స్టైల్‌గా లోపలకు. కుయ్ కుయ్ అని అరుస్తున్న శునకరాణి హీరోని క్షణం సేపు లేని తోకను అటూ ఇటూ ఊపుతూ పరిశీలనగా చూసింది.

మరుక్షణంలో డాబర్‌మెన్‌గాడు ఆమె చేతిలో గొలుసు తెంపుకుని శునకరాణి దగ్గరకు వెళ్ళి దానిని అన్ని వేపులా వాసన చూడడం, అది వెంటనే దాని యజమాని చేతిలో గొలుసు లాగేసుకోవడం రెండూ ఒకదాని చుట్టూ మరొకటి తిరగడం జరిగింది. ఆ తరువాత ఒక్క క్షణంలో శునకరాణి ముందు ఆ వెనుక డాబర్‌మెన్ గారు పరుగులు పెడుతూ రోడ్‌మీదకు లంఘించారు. వాటి వెనకాలే వాటి యజమానులూ తమ తమ కార్లతో వెళ్ళిపోయారు. అయ్యో కనీసం కొంచం డబ్బులైనా తిసుకోకపోతిని అని నాలో నేను అనుకుంటున్న సమయంలో నా వేపు 'బాపుగారి కార్టూన్'లో చేతిలో గరిటెతో నిలబడ్డ బక్కపలచని భర్తను చేతిలో అప్పడాలకర్రతో నిలబడ్డ పీపా లాంటి భార్య మిర్రిమిర్రి చూపులు చూస్తున్నట్లుగా ఎదురుగా నా భార్య నిలబడి ఉంది. ఇలాంటి సందర్భాలలో వెంటనే స్పందించాలి లేకపోతే సమయం మించిపోతుందని.

'అది కాదే మొదటి కేసు కదా వాళ్ళు/ వాళ్ళ కుక్కలు దొరికాక నా దగ్గరకు వచ్చి డబ్బు ఇచ్చి వెళ్లారు. 'ఇద్దరికీ ముందే చెప్పాను లే..' అన్నాను. 'చాల్లెండి చోద్యం. ఇక ఈ మాయదారి మేళం కట్టిపెట్టండి' అంది నషాళానికెత్తిన కోపంతో రౌద్రంగా. మూడు దశాబ్దాల మా సంసార జీవితంలో ఆమెను అంత కోపంలో ఎప్పుడూ నేను చూడలేదు. ఇంతలో ఫోను 'వాట్ కెన్ ఐ డూ' అన్నాను.

'మా జర్మన్ షెపర్డ్‌కి మంచి మేల్ డాగ్ కావాలి. మంచి పట్టులాంటి మెరిసిపోయే మెత్తని జుట్టుతో మహారాణిలా ఉంటుందండి. దాని కళ్ళల్లోకి మగకుక్క చూస్తే దాసోహం అయిపోతుందనుకోండి. దానికి వయసొచ్చేసింది. అప్పుడప్పుడు గొలుసు తెంపేసుకుని ఊర కుక్కల వెంట పడుతూంది' అన్నారు ఒకాయన.

'ఓకే. మా పప్పీలవ్‌కి ఫోన్ చేసినందుకు ధన్యవాదాలు. మీ జర్మన్ షెపర్డ్‌కి ఈ ఊళ్ళోనే మాంచి దివ్యమైన సంబంధం ఉంది. రేపు సాయంత్రం ఆరు గంటలకు తీసుకురండి. అదే సమయానికి మేల్ షెపర్డ్‌ని తీసుకువచ్చే ఏర్పాటు చేస్తాం. కాని ఒక్క షరతు. మీరు వచ్చి ముందుగా పదివేల రూపాయలు డిపాజిట్ చేయాలి' అనగానే ఆయన వెంటనే ఆన్‌లైన్ ఎకవుంట్‌లో పదివేలు జమ చేసేశాడు ఇక గొడవ లేదు.

మర్నాడు మూడు అడుగుల ఎత్తులో బాగా బొచ్చు ఉండి, నలుపు బ్రౌన్ కలర్స్‌లో కుంచె చీపురు లెవల్‌లో ఉన్న తోకతో పులిలా ఉన్న జర్మన్ షెపర్డ్ డాగ్‌తో ఒక హోండా సిటీ కారు వచ్చింది. ఆయన వస్తూనే 'నమస్తే ఇదిగో ఇదే మా లేడి షెపర్డ్' అంటూ వచ్చారు. 'మీరు ఆ గదిలోకి వెళ్ళండి' అని పెళ్ళిచూపుల గదిలోకి పంపించాను. ఇంతలో ఎంబాసిడర్ కారులో మరో జర్మన్ షెపర్డ్ కుక్కతో ఇంకొకరు వచ్చారు. ఇది గొలుసు లాగేస్తూంటే చాలా బలం ఉపయోగించి దాదాపు ఆయన వెనక్కి పడిపోతున్నట్టుగా వచ్చారు. 'ఇదే మా మేల్ జర్మన్ షెపర్డ్ వీడిని చూస్తే ఒక్క చూపులోనే ఆడకుక్కలు వలలో పడిపోతాయనుకోండి. ఏం రాజసం అనుకున్నారు చూడండి సిల్క్ లాంటి నలుపు బ్రౌన్ కలర్ బొచ్చుతో ఎలా మెరిసిపోతుందో, అన్నారు.

అది పెద్ద కళ్ళతో కోరల్లాంటి పళ్ళు కనిపిస్తూంటే నోరు తెరుచుకుని భయంకరంగా ఉంది. ఈ కుక్క ఉన్న ఇంట్లో దొంగ ప్రవేశిస్తే వాడి పీక పట్టుకుంటుంది ఎగిరి ఒకేసారి. నాకు దాన్ని చూస్తే ఒక్కసారి దడ పుట్టింది. మొన్న జరిగిన పెళ్ళిచూపుల సంఘటన గుర్తుకువచ్చి ఎందుకైనా మంచిది కొంచెం దూరంగా ఉండాలని అనుకున్నాను. 'దీనికి కోపంఅండీ బాబూ!' అంటున్నారాయన. నేను వెంటనే ఆ గదిలోకి తీసుకు వెళ్ళండి అన్నానో లేదో ఆయన వంద నోట్ల కట్ట నా బల్లమీద పెట్టి లోపలకి వెళ్ళబోతుంటే నాకెందుకో ఆ డాగ్‌ని పలకరించాలనిపించింది. పోయేకాలం వస్తే అని పెద్దలు

అంటుంటారు ఇదేనేమో... హాయ్ నీకు పెళ్ళాం లోపల ఉందిరా. చ్చు.. చ్చు.. 'అన్నానో లేదో అది నా మీదకు ఉరికింది. నేను తృటిలో తప్పించుకుని వీధి గుమ్మం వైపు పరుగు పెట్టాను. అది వదలకుండా నా వెంటే పరుగు పెడుతూనే ఉంది. నేను మిల్కాసింగ్‌ని పరుగుల రాణి పీటీ ఉషను, మరికొంతమంది పరుగుల వీరులను తలచుకుని తిరిగి చూడకుండా పరుగులు పెడుతూనే ఉన్నాను. దాదాపు ఊరి చివరకు వచ్చేశానేమో. నా వెనుక కుక్క ఉన్నదా లేదా అన్నది అప్రస్తుతం. సేవ్‌మి... సేవ్‌మి అని అరుస్తున్నాను.

ఏంటి పిచ్చి కేకలూ మీరూనూ సేవ్‌మి సేవ్‌మి అని అరుస్తున్నారు. ఏమైంది మీకు?' అంటోంది నా శ్రీమతి బెడ్‌మీద నా పక్కనే నన్ను కదుపుతూ. 'అమ్మబాబోయ్! అయితే నిజంగా నన్ను జర్మన్ షెపర్డ్ కుక్క తరమడం లేదన్నమాట' అని ఊపిరిపీల్చుకున్నాను. ఆ రోజు ఉదయాన్నే పేపర్లో పప్పీ లవ్ డాట్‌కామ్ అన్న ఫీచర్ చదివి ఆ వ్యాపారం పెడితే ఎలా ఉంటుందని ఆశపడిన నా ఆలోచనలపై గంగాళంతో నీళ్ళు చల్లినట్టయింది. 'ఏం కాలేదు పీడకల' అన్నాను. 'రోజూ కాసేపు అలా గుడికైనా ఏడవండి. ప్రశాంతంగా ఉంటుంది మనసు' నా వైపు కొరకరా చూసింది నా శ్రీమతి. మరలా బాపుగారి కార్టూన్స్‌లో అప్పడాల కర్ర పట్టుకున్న పీపాలాంటి స్త్రీ నా కంట్లో మెదలింది అమ్మో అనుకున్నాను. ●

(స్మైల్ ప్లీజ్ నవ్వండి, మాసపత్రిక, ఫిబ్రవరి 2010)